

# మగపెళ్ళి వారమండీ!

**హా**ల్లో కూచుని ఉన్నారు తాతయ్య. వంట వెంకట్రావు హడావుడిగా వచ్చాడు. "మీరు చెప్పినట్లే అరవైఅయిదూ ముప్పై అయిదూ రెండు వీసెలు పట్టి వుంచమన్నాను" అన్నాడు.

"భేష్. డెబ్బై ముప్పై అయితే రుచి తగ్గిపోతుంది" అన్నారు తాతయ్య.

"అవును. అందులో మనింట్లో బ్రహ్మీ ముహూర్తం మొదలు అర్ధరాత్రిదాకా గంటగంటకూ కాఫీలు కావాలాయెను" అన్నాడు వెంకట్రావు.

పక్కనే ఉన్నారు పెద్దనాన్న. "బాబాయ్! మేము ఏమైనా అంటే 'గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించడం' అంటారు. ఏవిటీ హడావుడి చెప్పండి? ఎవరైనా చూస్తే నవ్విపోతారు" అన్నాడు కాస్త విసుగ్గా.

"అట్లాగా!! నాకు తెలియదులే! ఏడిశావుగానీ నీ పన్లు నువ్వు చూసుకో. కాదూ–నా కొడుకు పెళ్లి నా ఇష్టం అంటావా, ఆ మాటేదో స్పష్టంగా చెప్తే నోర్మూస్కుని కూర్చుని ఆవేళ్టికి భుజంమీద ఉత్తరీయం వేసుకొచ్చి బస్సు ఎక్కుతాను. ఆ తర్వాత తేడా ఏమైనా వస్తే–'బాబాయ్ పెద్దవారు. నాకు చెప్పలేదేం' అనిమాత్రం అనకు" అన్నారు తాతయ్య.

"ఏమైనా అంటే ఇదిగో ఈ బెదిరింపు ఒకటి?" అని సణుక్కుంటూ వెళ్ళిపోయారు మా పెదనాన్న.

"వీడు మహా చెప్పొచ్చాడు నాకు!" అని పనిలో మునిగిపోయారు తాతయ్య.

అసలు విషయం ఏమిటంటే-మా అన్నయ్యకి పెళ్ళి కుదిరింది. పరాయి సంబంధం. మా ఇంట్లో ఇంచుమించు అన్నీ దగ్గర సంబంధాలే. ఇపుడు మా పెదనాన్నగారి అబ్బాయికి బయట సంబంధమే ఖాయం చేశారు. అటువైపు పెద్దవాళ్ళు తాంబూలాలకి వచ్చినప్పుడు "అయ్యా! మీరు పెద్దవారు. మీతో తూగగలమో లేదో!" అన్నారుట తాతయ్యగారితో.

మా ఇంట్లో పెద్దవారు ఆయనే. ఏ శుభకార్యం జరిగినా ఆయన చేతిమీదగానే జరగాలి.

"ఇతర విషయాలలో మీరు అనవసరంగా హైరానా పడకండి. ఇకపోతే పెళ్ళిలో భోజనాలుమాత్రం దర్జాగా వుండాలి. మా ఇంట్లో శుభకార్యం అంటే అందరూ ఎదురుచూస్తారు" అన్నారుట తాతయ్య.

"అయ్యో! ఎంతమాట. మా శాయశక్తులా చేస్తాం" అన్నారుట వాళ్ళు. ముహూర్తం పెట్టారు.

పెళ్లి హడావుడి మొదలయింది. మేము పెళ్ళికి తరలివెళ్ళాలంటే ఆడవాళ్ళకో బస్సు, మగవాళ్ళకి ఒక బస్సు. పెళ్ళికొడుకు కారు ఉండనే వుంటుంది. 'పెళ్ళి' అని తెలియగానే మా ఆస్థాన వంటవాడు వెంకట్రావు వచ్చి వాలిపోయాడు.

"చెప్పండి పెద్దయ్యగారూ. పెళ్ళికొడుకుని చేసేరోజున వంట ఏవిటీ? సత్యనారాయణ వ్రతానికేం చేయిద్దాం?" అన్నాడు.

"మనింట్లో మాట సరేలే వెంకట్రావ్. అది నీకు నల్లేరు బండిమీద నడక. పెళ్ళివారు కొత్తవారు... పైగా పల్లెటూరు. మనమేమో ఇంతమంది బంధువులని వెంటబెట్టుకు వెళ్తున్నాం. అటూఇటూ అయితే మాటదక్కదు. చార్జీలు ఇస్తాను నువ్వోసారి చూసొస్తావేమిటి?" అన్నారు.

"ఓ! దానికేం భాగ్యం, వెళ్లి చూసొస్తే పోయె" అన్నాడు వెంకట్రావు.

అట్లాగే వెళ్ళొచ్చాడు. "అంతా బాగానే వుంది. గాడిపొయ్యా పాత్ర సామాను అన్నీ సలక్షణంగా ఉన్నాయి. కాకపోతే శుద్ధ పల్లెటూరు. ఏవీ దొరకవు. మరి మనింట్లో

గంటగంటకీ కాఫీలు కావాలి. పంటికిందికి ఫలహారాలు కావాలి. వాళ్లు ఈ బస్తీ మర్యాదలు చెయ్యగలరా అని అనుమానం?" అన్నాడు.

కాసేపు ఆలోచించి-"వెంకట్రావ్-ఓ పనిచెయ్. నువ్వూ మాతోబాటు వచ్చెయ్. వంట పందిట్లో నువ్వు వున్నావంటే ఇక నాకు నిశ్చింత" అన్నారు.

"దానికేం భాగ్యం, వస్తే పోయె" అన్నాడు వెంకట్రావు. తాతయ్య ఊపిరి పీల్చుకున్నారు. వెంకట్రావు ప్రయాణం అయిన దగ్గరనుండీ ఒకటే హడావుడి.

"పెద్దయ్యగారూ! మరి, మంచి కాఫీపొడి అక్కడ దొరుకుతుందో లేదో! మన దత్తాత్రేయుడి కొట్లో కాఫీపొడి పట్టుకెళ్దామా?" అన్నాడు.

"నిజమే! కాఫీ బాగుండకపోతే పెళ్ళేం రాణిస్తుంది?" అన్నారు తాతయ్య.

అది మొదలు సందడి.

"వెంకట్రావ్! బంతిమీద వంకాయకూర లేకపోతే ఏం బావుంటుంది? భేషైన వంకాయకూరకి మరి గరువు వంకాయలు కావాలి. మన బాపట్ల బంధువులకు చెప్పించేస్తే ఓ బస్తాడు వేసుకొస్తారు" అన్నారు తాతయ్య.

"బంధువులు మూడ్రోజుల ముందే వస్తారు. వాళ్లు వస్తూ తెస్తే వాడిపోతాయి. మా తోడల్లుడికి కబురుపెడితే సాయంత్రం కోయించి మనం బస్సెక్కే వేళ్టికి తెచ్చేస్తాడు" అన్నాడు వెంకట్రావు.

ఇలా జాబితా హనుమంతుడి తోకలా పెరిగిపోయింది. అక్కడ కందిపప్పు లక్కలా ఉడుకుతుందో లేదో అని పాతిక వీసెలు పప్పు మూట కట్టించారు. గోంగూర, మిరప్పళ్లు, కుండెడు వెన్నపూస, అనుపానాలన్నీ సరే-మరి అన్నం మాట ఏమిటో అనుకుని ఆరుబస్తాల సన్నబియ్యం సిద్ధం చేశారు. ఇంకా తెల్లబెల్లం దగ్గర్నించి తాటాకు విసనకర్రలదాకా వంద శాల్తీలు సిద్ధం చేశారు. "వీళ్ల హడావుడి చూస్తే రుబ్బురోళ్లూ తిరగళ్లూ కూడా వేసేట్లు ఉన్నారు" అని విసుక్కున్నారు పెదనాన్నలూ బాబాయిలూ.

ఒక బస్సుమీద చుట్టాల పెట్టెలూ బేడలూ, రెండో బస్సుమీద ఈ సామాన్లు. వీటిని చూసేందుకు జెమాజెట్టీల్లాటి మనుషులు, అసిస్టెంట్లతో వెంకట్రావు. అందరం బయలుదేరి పెళ్ళికెళ్ళాం. మా ఇంట్లో అన్ని పెళ్ళిళ్ళలాగానే ఆ పెళ్ళీ బ్రహ్మాండంగా జరిగింది.

వంట దగ్గర వెంకట్రావుదే పెత్తనం. ఆడపెళ్ళి వారివైపు వంటవాళ్ళు కూరలు తరగడం, పప్పు రుబ్బడం, లడ్లు కట్టడం, వగైరా సహాయాలు చేశారుట.

అప్పగింతలు అయ్యాక వెంకట్రావు వద్దంటున్నా వినకుండా కన్యాదాత పంచెలచాపు పెట్టి నూటపదహార్లు ఇచ్చారుట.

అటువైపు పెద్దలంతా ఇటువైపు పెద్దల దగ్గరకి వచ్చి–"అయ్యా! ఏం వంటలూ ఏం వైభోగం! జిహ్వ లేచివచ్చిందంటే నమ్మండి! మా ఇంట్లో ఇంకో నలుగురాడ పిల్లలుంటే అందరికీ మీ ఇంటి సంబంధమే చేసేవాళ్లం" అన్నారుట వినయంగా.

* * *